నాకు చెప్పరాని సంతోషం కలిగింది.

నేను పరవశించిపోయాను.

ఒకవేళ రేపు నేను చచ్చిపోతే ఒక్క క్షణం ఈ పట్టుచీరకేసి చూస్తే నేను వారికి పూర్తిగా జ్ఞాపకానికి వస్తాను?

అప్పుడా చీరను మహోత్కంఠతలో వారు కావిలించుగుంటారు.

లక్ష ఫోటోలు కూడా ఆ పట్టుచీరకు సాటిరావు.

అయ్యో; నా పట్టుచీరా - కన్నతల్లీ;

# బల్లకట్టు బెల్లపావకాయ

కొత్త చింతకాయలు తింటే డాక్టరుకి డబ్బొస్తుంది. మనకు జబ్బొస్తుందీ, మా ఊరుకాలవగట్టు పొడవునా చింతచెట్లే -

చీకూ చింతా లేకుండా ఎవరూ జీవించలేరు. కాలవగట్టుమీద చింత చెట్లుండాల్సిందే. చింతచెట్లు క్రిందనుంచి బస్సులు రిక్షాలు మనుష్యులూ తిరగాల్సిందే.

కాలవ వుండాలి. (మా ఊరికో కాలవుంది) కాలవమీద బల్లకట్టు వుండాలి.

కాలవకి రెండువైపులావున్న ఊళ్ళకి వంతెన లేకపోతే బల్లకట్టే ప్రాణం.

మా కాలవ నరసాపురం కాలవ.

మా ఊరు మార్టేరుకి మైలున్నర.

కాలవ బల్లకట్టు లేకపోతే ఊరికి అందంలేదు.

నాకు బల్లకట్టంటే ఇష్టం.

మా వూరి బల్లకట్టు నాకు చిన్ననాటి నేస్తం

ఆ బల్లకట్టుమీద కూర్చుని నీళ్ళల్లో కాళ్ళాడిస్తూ వూసులాడుకునేవాళ్ళం. పోసుకోలు కబుర్లు, కథలూ, కాకరకాయలూ చెప్పుకునే వాళ్ళం.

ఆ కాలవ నీళ్ళూ ప్రవాహం. వాటి మిలమిలలు ఆకాలవమీదకు వంగి నీడలు చూసుకొంటున్న చెట్లు, ఆ గట్లమీద పరుగులెత్తి చెట్టా పట్టాలు వేసుకుతిరిగి మేము ఆడుకున్న ఆటలు పోట్లాటలు గుర్తే.

ఆ కాలవ ఎండిపోయినప్పుడు యిసకలో ఎన్నో పిచ్చుకగూళ్ళు కట్టాం. చలమలు తవ్వి లిక్కిలిక్కి చెంబుతో నీళ్ళు తెచ్చుకునే వాళ్ళం.

కాలవ నిండుగా వున్నప్పుడు భయంవేసేది.

నిజవేఁ

కాలవ పూర్తిగా ఎండిపోయినప్పుడు ఎవరో గొప్పవాడు హఠాత్తుగా పేదవాడైపోయినట్లు వున్నదంతా పూడ్చిపెట్టుకుపోతే ఎంతదిగులుగా భయంకరంగా వుండేదో ఆ ఎండిన కాలవ చూస్తున్నప్పుడు అలా అనిపించేది.

మేవు ఆ ఎండిన కాలవమధ్యలో తడి ఇసుకలో ఎన్నిరకాల ఆటలు ఆడవచ్చో అన్నీ ఆడి తలలు, బట్టలు తడుపుకుని దొడ్డిగుమ్మంలోంచి దొంగల్లా ఇళ్ళల్లోకి జొరబడేవాళ్ళం.

ఎన్ని మొట్టికాయలు, వీపుమీద అప్పచ్చులు తినకుండా వెళ్ళమారింది బాల్యం;

ఆ మొట్టికాయలు వీపు మీద గుద్దులు మోకాళ్ళమీద చింతబరికితో దెబ్బలూ శొంటిపిక్కలూ, గిల్లులూ అవేవీ యిప్పుడు జ్ఞాపకంలేవు.

ఇప్పుడల్లా జ్ఞాపకముండేది ఆ బల్లకట్టూ దానిమీద మేం వేసిన చిందులూ... బెల్లపావకాయ... అబ్బ, ఈ బెల్లపావకాయ జ్ఞాపకమొచ్చిందేమిటి యిప్పుడు?

బూరిల్లా వాచిపోయిన బుగ్గలు, చీమిడిముక్కు కళ్ళకలకల్తో మూసుకుపోయిన చీకిరీకళ్ళూ అప్పుడు నేనెలా వుండేదాన్నో వూహించుకుంటే నాకు కళ్ళనీళ్ళు తిరుగుతాయి. వయసుమీదకు పరువం తేకపోతే కాలం కళ్ళకు మత్తుమందు జల్లకపోతే, ఈ వయసు తెచ్చిన సొగసుతో నేను మాబావ ఒళ్ళోవచ్చి వాలానుకాని - ఈ చీకిరికళ్ళ, చీమిడిముక్కు రాక్షసిని ఎవరు పెళ్ళాడేవారు? ఎవరూ పెళ్ళాడేవారుకాదు. మేనరికాల్లో బ్యూటీకి దే డోంట్ కేర్. సో ఐలైక్ మై బావగారు. కంట్రీగరల్ని పెళ్ళాడినందుకు ఎప్పుడూ విచారించలేదు. మేన మావఁ కూతురిదగ్గరున్న లిబర్టీ, ఫ్రీడం చనువూ సరదా మరోకొత్తగుంట దగ్గర (నాకు బెల్లపావకాయంటే యిష్టం అని చెప్పాను విశాఖపట్నం అంటే కూడానాకిష్టమేఁ) కట్నం తెస్తుందనుకోండి, తెచ్చినా ఆ లవ్వూ స్నేహమూ డబ్బెట్టి కొనుక్కుతెచ్చుకొన్నవే ఎగ్జాట్లీ; డబ్బెట్టి మొగుళ్ళను కొనుక్కు తెచ్చుకున్న అమ్మాయిలంతా మేనమావఁ కూతుళ్ళ కాలిగోరుకుపోలరు. బజార్లో మొగుడ్ని కొనుక్కుని పిల్లల్నుకని పైగా మాట్లాడొస్తోంది అని చెప్పవచ్చు ఎగ్జాట్లి.

మేనమావఁకొడుకైతే మొగుడు ఆఫీస్‌బాయ్‌లా మనచేతిలో వుంటాడు.

పరాయి సంబంధమైతే అంతా అతికీ అతకక కొత్తకొత్తగా పచ్చిపచ్చిగా వుంటుంది. ఇద్దరు ముగ్గురుబిడ్డల తల్లికి కూడా పగలు మొగుడ్ని చూస్తోంటే పరాయి పురుషుడులా కనపడొచ్చు అర్ధనారీశ్వరుడులా అవుపడ్డు.

బెల్లపావకాయగురించి చెబుదామనుకుని పెళ్ళి సంబంధాల గొడవల్లో పడిపోయేను. మేనరికాలలో బెల్లపావకాయ రుచి వుంది కాబోలు నేనేదైనా సీరియస్‌గా చెబుదామనుకుంటే మధ్యలో బెల్లపావకాయ వచ్చి నా ప్లానంతా పాడుచేస్తుంది.

బెల్లపావకాయంటే నాకిష్టమన్నాను గదా!

బల్లకట్టంటే కూడా నాకిష్టవేఁ

ఎప్పుడూ ఆకుపచ్చరంగు సిల్కుగౌను తొడగమని ఏడిచేదాన్ని. భుజాల క్రిందకు దిగిపోయిన ఆకుపచ్చ సిల్కుగౌను ఒకటుండేది నాకు. మోకాళ్ళకిందకు దిగిపోయిన లాగుతొడుక్కుని ఆ

గౌను వేసుకుని ఒక చేత్తోచందనపు బొమ్మను పట్టుకుని, బెల్లపావకాయ పెచ్చుచీక్కుంటూ, మా గుమ్మంముందు అరుగు క్రింద కొబ్బరిచెట్టు నీడను టైలరు దగ్గరనుంచి తెచ్చిన రంగుల గుడ్డపీలికలు, మొచ్చెకాయితాలు, రంగుల పూసలు సబ్బు పెట్టె, పాతసీసాలు, విరిగిపోయిన వినాయకుడి మట్టిబొమ్మ పెంకులతో – రాళ్ళతోకట్టిన బొమ్మరింట్లో వుత్తుత్తి అన్నాలు వొండుకుని కొబ్బరి పుచ్చెలతోనూ, టెంకాయ చిప్పలతోనూ లక్క పిడతలెట్టి ఆడుకునే దాన్ని. ఆ ఆవకాయ పెచ్చు వున్నంతసేపూ చీకుతూ ఆడుకుని అక్కడే నిద్రొచ్చి నేను కట్టుకున్న బొమ్మరింట్లో నా ఆటవస్తువులన్నీ నేలమీద అలాగే వుండగా నిద్రపోయేదాన్ని.

ఆ బొమ్మరింట్లో వుత్తుత్తి అన్నాలు వొండితిని పడుకున్న ఆ దశలో ఇన్ని కన్నీళ్ళూ, ఇన్ని బాధలూ, ఇన్ని కష్టాలూ ఎరగం: ఇంత దొంగరాస్కెల్సు ప్రపంచంనిండా వున్నారని తెలీదే.

బొమ్మ విరిగితే ఏడిస్తే ఇంకో బొమ్మ తెచ్చిఇచ్చేవారు. ఇప్పుడు బొమ్మ పారేసుకుంటే ఆలోటు ఎవరూ భర్తీ చెయ్యలేరు.

అవును – అప్పుడు నేను ఆడుకున్న నా బొమ్మల పెట్టె నాచెక్కబొమ్మలు నా ఆటవస్తువులు నా ప్రాణాధికాలు. అవన్నీ ఇప్పుడెక్కడున్నాయి?

ఆ బొమ్మలు ఆ రంగుల గుడ్డపేలికలు అన్నీ మా వూళ్ళొ పుట్టింట్లో వదిలేసి మొగుడితో లేచొచ్చేశానా?

మావూళ్ళొ ఒక టైలరుండేవాడు. వాడు పిల్లల్ని ప్రేమించేవాడు. కుట్టవలసిన క్రొత్తగుడ్డల్ని ద్వేషించేవాడు.

అందరి బట్టలూ గుడ్డలే. పొట్టీ, పొడుగూ వొదులూ, బిగుతూ ఏదో వొకటి తిన్నగా చచ్చినా కుట్టేవాడు కాదు.

కాలజ్ఞానం బొత్తిగా లేదు. స్వాములారు కావలసినవాడు. అయినా అప్పుడా టైలరు కుట్టిన ప్రతీ క్రొత్త గౌను, పరికిణీ, చొక్కా ఎంత సంతోషం కలిగించేదో తల్చుకుంటే, ఇప్పుడూ ఎంతఖరీదైనా నవనాగరికపు దుస్తులు వేసుకున్నా, ఆసుఖం ఆ సంతోషం వేరు. ఈ దర్జాలలో ఆ సుఖాన్ని పోల్చుకుందుకు ఎంత మాత్రం వీల్లేదు.

అప్పుడుతిన్న ఆ బెల్లపావకాయరుచి డబ్బుతో కొంటే వొస్తుందా సార్?

బెల్లపావకాయ్ కాదు.

జీళ్ళు, తాటిముంజలు, బెల్లపుపాకం, అరిసెలు, మినప సున్నుండలు, పూతరేకులు యివేకాదు ఆఖరికి పప్పులో వూరేసిన నిమ్మకాయ డొక్కకాని, మాగాయ ముక్కగాని, ఆఖరికి వెధవధి మజ్జిగలో తడిపిన మాగాయ టెంకయినా సరే దేనిరుచి దానిదే.

ఏవయసులోనైనా దేనిరుచిదానిదే – బైగాడ్ చెప్తున్నాను.

ఇక బెల్లపావకాయ మాటెత్తను.

అద్దరివారి నిద్దరికి ఇద్దరివారి నద్దరికి జేర్చుట అదెంత భాగ్యం;

ఆ బల్లకట్టు ఎంత పుణ్యం చేసుకుందో...

మా నాన్న యించుకంత కోపిష్ఠి - అతనికి బల్లకట్టు కావలసొచ్చి నప్పుడల్లా అతను యివతలుంటే అది అవతలుండేది.

వర్షం కురుస్తూంటే గబగబా వస్తే గెడ వదిలేసి బల్లకట్టు సుబ్బన్న ఏ చెట్టుకిందోవెచ్చగా చుట్ట కాల్చుకుంటూ వుండేవాడు.

చెప్పానుగా మావూరు మార్టేరుకి మైలున్నర - కాలవకి రెండువేపులా వుందని.

ఇవతల పంచాయతీ ఆఫీసు, కరణం, మునసబు, చుట్టలకొట్టు బడ్డీ దుకాణం, కాఫీహోటలు, చెరువు, లైబ్రీ, దుకాణం, సైకిలుషాపు వుంటే అవతల గట్టున దేవాలయం, సారాకొట్టు, చాకలిరేవు, పురోహితుడు, రైతులు, కూలీనాలీ వున్నారు.

ఆ వైపుకు వెళితే యీవైపున పనుంటుంది. ఇటొస్తే మళ్ళీ అటు వెళ్ళాలి.

జీవితమంటే యిటూ - అటూ -

కాలవ ఎండిపోవడం మళ్ళీ కాలవరావడం - పడవలూ పడవ పాటలూ క్రొత్తనీరూ క్రొత్త నీట్లో కొట్టుకొచ్చే శవాలూ యివే కబుర్లు మాకెంతసేపూ.

నేను చిన్నప్పుడు బల్లకట్టు గెడెయ్యటంకూడా నేర్చుకున్నా.

ఓసారి నేనూ మా వారూ బల్లకట్టు దాటుతున్నాం. ముసిలి అని ఓడుండేవాడు మా వూళ్ళో, వాడు నా మీద మీదకొచ్చి -

"బెల్లపావకాయ చీకే అమ్మడు నువ్వేనా తల్లి" అని ఆప్యాయంగా అడిగాడు.

మా వారు యాంగ్రీ అగ్నిహోత్రుడైపోయారు వాడిమీద

ఈ సీమిండి ముక్కు పిల్లని నానెత్తుకుని మోశా బాబూ; అని కాలవలోకి వుమ్మేసి చుట్ట నోట్లో మరో పక్కకి మార్చుకున్నాడు నిర్లిప్తంగా

"నీకు తెలీదు ముసిలీ- అప్పుడు మనింటికి సుబ్బారావని టైఫాయిడ్ జ్వరంవచ్చి యింతపొట్టేసుకుని కాళ్ళు వూసల్లా సన్నగా వో అబ్బాయి రాలా నువ్వుచీకట్లో సాయం వేళ్ళే వాడివి మా మేనత్తగారబ్బాయని, ఆయనే యీయన, అని ముసిలికి చెప్పాను కావాలనె.

"తవరా బాబూగుర్తుంది! గుర్తుంది" అని మెరిసే కళ్ళతో చూశాడు వాడు. రూపాయిచ్చాను నేను మా వాడ్ని డౌన్ చేద్దామనే వుద్దేశంతో.

అప్పుడు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నందున వారుచాలా ఇన్సల్టింగ్‌గా ఫీలయారు. వొకదర్టీ ముసలిగాడి ముందులోకువైనందుకు నాతో మూడ్రోజులు మాటాడలేదు మా ఇంటిమగవారు.

అది మా బల్లకట్టు తగూ -

అయినా ఐడోంట్ కేర్:

మావూర్లొ మా బల్లకట్టు ముసిలిని ఇన్సల్ట్ చేస్తే మావారైతే మాత్రం ఐ డోంట్ లైకిట్:

ముసిలీ- ఆ బల్లకట్టుమీద నీ చంకెక్కి బెల్లపావకాయ చీకే చీమిడిముక్కమ్మాయిని నేనే.... నేనే...నేనే;